కాంగ్రెస్ రిసార్ట్ రాజకీయం

- **నేడు రాజ్యసభ ఎన్నికలు**
- **కర్ణాటకలో క్రాస్ ఓటింగ్ భయం**
- **హోటల్‌కు ఎమ్మెల్యేల తరలింపు**



బెంగళూరు: రాజ్యసభ స్థానాలకు మంగళవారం ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో కర్ణాటకలో అధికార కాంగ్రెస్ రిసార్ట్ రాజకీయాలకు తెరలేపింది. క్రాస్ ఓటింగ్ భయంతో పార్టీ ఎమ్మెల్యేలందరినీ సోమవారం ఒక హోటల్‌కు తరలించింది. రాష్ట్రంలో నాలుగు రాజ్యసభ స్థానాలకు ఎన్నికలు జరుగుతుండగా.. కాంగ్రెస్ పార్టీ నుంచి ముగ్గురు, బీజేపీ, జేడీఎస్ పార్టీల నుంచి ఒక్కరు చొప్పున పోటీపడుతున్నారు. మంగళవారం ఓటింగ్ నేపథ్యంలో ఇప్పటికే ఆయా పార్టీలు తమ శాసనసభ్యులకు విప్ జారీచేశాయి. అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 134 మంది ఎమ్మెల్యేలు ఉండగా.. బీజేపీకి 66, జేడీఎస్‌కు 19 మంది శాసన సభ్యుల బలం ఉన్నది. ఇద్దరు స్వతంత్రుల మద్దతుతో కాంగ్రెస్‌కు మూడు స్థానాలు గెలుచుకొనే బలం ఉండగా.. బీజేపీ-జేడీఎస్ కూటమి ఒక స్థానంలో గెలిచే అవకాశం ఉన్నది. అయినప్పటికీ రెండో అభ్యర్థిని బరిలో నిలుపడంతో కాంగ్రెస్‌కు క్రాస్ ఓటింగ్ భయం పట్టుకొన్నది. నాలుగు స్థానాలకు నలుగురు మాత్రమే బరిలో ఉంటే.. ఒక అభ్యర్థి విజయం సాధించేందుకు 45 ఓట్లు సాధించాల్సి ఉంటుంది. నలుగురు కంటే ఎక్కువ మంది అభ్యర్థులు బరిలో ఉన్న పక్షంలో ప్రాధాన్యతా ఓట్లను పరిగణనలోకి తీసుకొంటారు.

యథావిధిగా జ్ఞానవాపీలో పూజలు

స్టే ఇచ్చేందుకు అలహాబాద్ హైకోర్టు నిరాకరణ

ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి 26: జ్ఞానవాపీ మసీదు సెల్లార్‌లో పూజలకు అనుమతించిన వారణాసి కోర్టు ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను అలహాబాద్ హైకోర్టు సోమవారం తిరస్కరించింది. మసీదులోని వ్యాస్ తెహ్‌ఖానాలో పూజలు కొనసాగుతాయని స్పష్టం చేసింది. మసీదు కమిటీ సంయుక్త కార్యదర్శి హైకోర్టు తీర్పుపై స్పందిస్తూ తాము సుప్రీం కోర్టును ఆశ్రయిస్తామన్నారు. జిల్లా కోర్టు తీర్పును సవాల్ చేస్తూ దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీం కోర్టు నిరాకరిస్తూ.. హైకోర్టును ఆశ్రయించాలని సూచించింది. సుప్రీం సూచనతో మసీదు కమిటీ ఫిబ్రవరి 2న హైకోర్టును ఆశ్రయించింది. మొఘల్ చక్రవరి ఔరంగజేబు పాలనలో హిందూ దేవాలయ అవశేషాలపై జ్ఞానవాపీ మసీదు నిర్మించారని కోర్టు ఆదేశాలపై ఏఎస్ఐ సర్వేలో వెల్లడైంది. మసీదు దక్షిణ సెల్లార్‌లో హిందువుల పూజలకు అనుమతిస్తూ జనవరి 31న జిల్లా కోర్టు తీర్పునిచ్చింది.

నాటో సభ్యదేశంగా స్వీడన్!

- **తొలగిన చివరి అడ్డంకి**
- **హంగేరి పార్లమెంట్ ఆమోదం**

బుడాపెస్ట్: రెండేండ్ల సుదీర్ఘ చర్చల అనంతరం నాటోలో స్వీడన్ సభ్యత్వం పొందటానికి మార్గం సుగమమైంది. ఇందుకు చివరి అడ్డంకిగా ఉన్న హంగేరి పార్లమెంట్ ఆమోదించటంతో సమస్య పరిష్కారమైంది. సోమవారం హంగేరి పార్లమెంట్‌లో జరిగిన ఓటింగ్‌లో స్వీడన్‌కు అనుకూలంగా 188 ఓట్లు రాగా.. వ్యతిరేకంగా 6 ఓట్లు మాత్రమే వచ్చాయి. దీంతో హంగేరి మిత్ర దేశాలు రెండేండ్లుగా చేస్తున్న కృషి ఫలించింది. 2022 జులైలో హంగేరి ప్రధాని విక్టర్ ఓర్బన్ ప్రభుత్వం స్వీడన్ ప్రవేశాన్ని ఆమోదించటానికి ప్రొటోకాల్ సమర్పించింది. దీన్ని పాలక పక్ష సభ్యులు వ్యతిరేకించటంతో ప్రతిష్టంభన ఏర్పడింది. కొత్త దేశాలకు నాటో సభ్యత్వం ఇవ్వాలంటే సభ్యదేశాలు ఏకగ్రీవంగా మద్దతు తెలపాలి. 31 మంది సభ్య దేశాలున్న నాటో కూటమిలో గత నెలలో తుర్కియే తన ఆమోదం తెలుపగా.. చివరిగా హంగేరి మద్దతు అవసరం పడింది. ఓటింగ్‌కు ముందు చట్టసభ సభ్యులనుద్దేశించి ఓర్బన్ మాట్లాడుతూ స్వీడన్, హంగేరిల సైనిక సహకారం, స్వీడన్ నాటో ప్రవేశం హంగేరి భద్రతను బలోపేతం చేస్తాయన్నారు. శుక్రవారం స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ హంగేరి రాజధానిలో ఆ దేశ ప్రధాని ఓర్బన్‌తో సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య సయోధ్య కుదిరినట్టు ప్రకటించారు. స్వీడన్ నాటో బిడ్ ఆమోదాన్ని అధికారికంగా ఆమోదించటానికి అధ్యక్ష సంతకం అవసరం.. ఇది త్వరలో జరుగుతుందని భావిస్తున్నారు.

కర్ణాటక రైతుల మృత్యుఘోష

10 నెలల్లో 692 మంది బలవన్మరణం

ప్రమాదవశాత్తూ మరో 548 మంది మృతి

కాంగ్రెస్ పాలనలో దయనీయ పరిస్థితులు

బెంగళూరు, ఫిబ్రవరి 26: కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న కర్ణాటకలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉన్నది. తీవ్ర కరువు, అప్పుల బాధతో వందలాది మంది అన్నదాతలు నిలువునా ఉసురు తీసుకొంటున్నారు. 2023, ఏప్రిల్ నుంచి ఈ ఏడాది జనవరి మధ్య 10 నెలల కాలంలో 692 మంది అన్నదాతలు ఆత్మహత్య చేసుకొన్నారని రాష్ట్ర రెవెన్యూ శాఖ తాజా గణాంకాలు వెల్లడించాయి. హవేరి, బెళగావి, చిక్కమగళూరు జిల్లాల్లో బలవన్మరణాల రేటు అధికంగా ఉన్నది. ఇదే సమయంలో అదే గత 10 నెలల్లో 548 మంది రైతులు పాముకాటు, ఇతర ప్రమాదాల కారణంగా మరణించారు. దీంతో రాష్ట్రంలో మొత్తంగా 10 నెలల వ్యవధిలో 1,240 మం ది రైతులు ప్రాణాలు కోల్పోయారు. ప్రైవేటు వ్యక్తుల నుంచి అధిక వడ్డీకి రుణాలు తీసుకొన్న ఇతర లక్షలాది మంది రైతుల పరిస్థితి మరింత ఘోరంగా ఉన్నదని, అప్పుల బాధతో రైతులు ఆత్మహత్యలు చేసుకొంటున్నారని పేర్కొన్నారు.

10 నెలల్లో 1,240 మంది మృతి

ఆత్మహత్య చేసుకొన్న వారు	ప్రమాదవశాత్తూ మరణాలు
692	548
పరిహారం తిరస్కరణ	పరిహారం తిరస్కరణ
76	42

జిల్లాలవారీగా బలవన్మరణాలు		ప్రమాదవశాత్తూ మరణించిన రైతులు	
హవేరీ	84	తుమకూరు	62
బెళగావి	75	బెళగావి	35
చిక్కమగళూరు	60	మైసూరు	33

బెంగళూరు మెట్రోలో రైతన్నకు అవమానం

- **మురికి దుస్తులు ధరించాడని అనుమతి నిరాకరణ**
- **సెక్యూరిటీ సూపర్‌వైజర్‌కు బీఎంఆర్‌సీఎల్ ఉద్వాసన**

బెంగళూరు, ఫిబ్రవరి 26: మురికి దుస్తులు ధరించాడన్న కారణంగా ఓ అన్నదాతను బెంగళూరులో మెట్రో రైలు ఎక్కనివ్వలేదు. ఈ నెల 18న జరిగిన ఈ ఘటనను ఓ ప్రయాణికుడు ఈ నెల 24న సామాజిక మాధ్యమంలో పోస్ట్ చేశాడు. రాజాజీనగర్ స్టేషన్‌లో మెట్రో రైలు ఎక్కేందుకు వచ్చిన రైతును సెక్యూరిటీ సూపర్‌వైజర్ అక్కడి నుంచి వెళ్లగొట్టేందుకు ప్రయత్నించాడు. ఇది చూసిన మరో ప్రయాణికుడు కార్తీక్ వెంటనే జోక్యం చేసుకుని ఏ కారణంతో రైతును మెట్రో రైలు ఎక్కనివ్వడం లేదని ప్రశ్నించాడు. టికెట్ కొనుక్కొని రైలెక్కేందుకు వచ్చిన వ్యక్తిని ఎందుకు అడ్డుకుంటున్నావని నిలదీశాడు. రైతు తలపై ఉన్న మూటలో కూడా ఎటువంటి నిషేధిత పదార్థాలు లేవని చెప్పాడు. మెట్రో రైలు ఎక్కేందుకు ప్రయాణికులు ఎటువంటి దుస్తులు ధరించాలన్న దానిపై ఏదైనా డ్రెస్ కోడ్ ఉంటే చూపించాలని అన్నాడు. ఆ తరువాత సదరు ప్రయాణికుడు ఆ రైతును తనతోపాటు రైలులో తీసుకెళ్లాడు. ఈ ఘటన సోషల్‌మీడియాలో వైరల్ కావడమే కాకుండా బెంగళూరు మెట్రో వ్యవస్థను విమర్శలు పాలుచేసింది. మెట్రో రైలు కేవలం వీఐపీలకేనా, సామాన్యులు ఎక్కకూడదా అంటూ నెటిజన్లు మెట్రో అధికారులపై విమర్శలు కురిపించారు. దీనిపై స్పందించిన బీఎంఆర్‌సీఎల్ ఆ ఘటనపై దర్యాప్తుకు ఆదేశించింది, రైతుకు జరిగిన అవమానం పట్ల విచారం వ్యక్తంచేస్తూ.. సెక్యూరిటీ సూపర్‌వైజర్‌ను విధుల నుంచి తొలగిస్తున్నట్టు ప్రకటించింది.

డబ్ల్యూటీవో ఒప్పందం నుంచి వైదొలగాలి

- **వ్యవసాయాన్ని బయటకు తేవాలి**
- **కేంద్రానికి రైతు సంఘాల డిమాండ్**
- **పలు రాష్ట్రాల్లో ట్రాక్టర్ ర్యాలీలు**

ప్రపంచ వాణిజ్యసంస్థకు వ్యతిరేకంగా పంజాబ్‌లోని శంభు సరిహద్దు వద్ద రైతుల నిరసన

న్యూఢిల్లీ/చండీగఢ్/లక్నో, ఫిబ్రవరి 26: ఎంఎస్పీకి చట్టబద్ధతో సహా పలు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం కొనసాగిస్తున్న రైతులు.. కేంద్రం ముందుకు మరో డిమాండ్ తీసుకొచ్చారు. పంట ధరల గ్యారెంటీలపై పరిమితులు విధించడం ద్వారా రైతుల సంక్షేమం, పురోగతికి అడ్డుగా ఉన్న ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఒప్పందం నుంచి భారత్ బయటకు రావాలని కేంద్రాన్ని డిమాండ్ చేశారు. డబ్ల్యూటీవో పరిధి నుంచి వ్యవసాయ రంగాన్ని బయటకు తీసుకొచ్చేందుకు ఇతర ప్రపంచ దేశాలపై ఒత్తిడి చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్కేఎం) ఆధ్వర్యంలో రైతులు దేశవ్యాప్తంగా 'క్విట్ డబ్ల్యూటీవో డే' ఆందోళన పేరుతో పలు రాష్ట్రాల్లో ట్రాక్టర్ల ర్యాలీ చేపట్టారు. ఈ నెల 26 నుంచి 29 వరకు అబుదాబిలో డబ్ల్యూటీవో 13వ మంత్రుల సదస్సు జరుగనున్నది. అన్ని దేశాలకు చెందిన మంత్రులు హాజరుకానున్న ఈ సమావేశంలో బహుముఖ ఆర్థిక వ్యవస్థను సమీక్షించడంతోపాటు సంస్థ అజెండాపై నిర్ణయం తీసుకోనున్నారు.

హైవేలపై ట్రాకర్లు పార్క్ చేసి నిరసన

ఎస్కేఎం పిలుపుతో దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా పంజాబ్, హర్యానాల్లోని జాతీయ రహదారులపై రైతులు తమ ట్రాక్టర్లను పార్క్ చేసి ఆందోళనలు చేశారు. దోబా కిసాన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు జంగ్‌వీర్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ డబ్ల్యూటీవో పాలసీలు రైతులకు వ్యతిరేకంగా ఉన్నాయని విమర్శించారు. ఏఐకేఎస్ నేత శంశేర్ సింగ్ మాట్లాడుతూ డబ్ల్యూటీవో పాలసీల కారణంగానే రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వడం లేదని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్‌లో రైతుల ఆందోళనతో ఢిల్లీ-యూపీ సరిహద్దుల్లో ట్రాఫిక్‌పై ప్రభావం పడింది.

కేంద్రానికి వ్యతిరేకంగా సీపీఐ ఆందోళన

హైదరాబాద్ (నమస్తే తెలంగాణ): పంటకు కనీస మద్దతు ధర ఇవ్వాలని కోరుతూ ఢిల్లీ సరిహద్దుల్లో శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై మోదీ ప్రభుత్వం క్రూరమైన అణచివేతకు పాల్పడుతున్నదని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ మండిపడ్డారు. రైతులపై కేంద్ర ప్రభుత్వ దమనకాండను నిరసిస్తూ సోమవారం ట్యాంక్‌బండ్ వద్దనున్న అంబేద్కర్ విగ్రహం వద్ద భారీ ప్రదర్శన నిర్వహించారు. చాడ వెంకట్‌రెడ్డి, పశ్యపద్మ పాల్గొన్నారు.

కోర్టు చెప్తేనే హాజరవుతా

ఏడోసారి ఈడీ విచారణకు కేజ్రీవాల్ గైర్హాజరు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: ఢిల్లీ మద్యం పాలసీ కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఏడోసారి ఈడీ విచారణకు హాజరుకాలేదు. ఈ వ్యవహారం కోర్టు పరిధిలో ఉన్నందున.. కోర్టు ఆదేశిస్తేనే విచారణకు హాజరవుతానని స్పష్టం చేశారు. తనను ఇండియా కూటమిని వీడేలా ఒత్తిడి చేసేందుకే తాజా సమన్లు పంపించారని ఆయన ఆరోపించారు. అయినా తాను కూటమితో బంధాన్ని తెంచుకోనని తెగేసి చెప్పారు. తనకు జారీ చేసిన సమన్లపై ఈడీనే కోర్టుకు వెళ్లిందని.. మార్చి 16న విచారణ జరగనుందని.. కాబట్టి వరుసగా సమన్లు పంపే బదులు అప్పటి వరకు వేచి చూడాలని కేజ్రీవాల్ ఈడీకి సూచించారు.

2 వేల రైల్వే ప్రాజెక్టులకు మోదీ ప్రారంభోత్సవం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: రూ.41 వేల కోట్ల విలువైన 2 వేలకు పైగా రైల్వే మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ సోమవారం ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. దేశవ్యాప్తంగా రైల్వే స్టేషన్ల పునరుద్ధరణలో భాగంగా 554 అమృత్ భారత్ స్టేషన్లకు శంకుస్థాపన చేశారు. వర్చువల్‌గా జరిగిన ఈ కార్యక్రమంలో మోదీ మాట్లాడుతూ అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా భారతీయ రైల్వే అత్యంత వేగంగా పరివర్తన చెందుతున్నదని పేర్కొన్నారు. పన్నుదారులు చెల్లించే ప్రతి పైసా ప్రజల సంక్షేమం కోసం ఖర్చు చేస్తున్నామన్నారు. యువతతో పాటు అందరూ కలగంటున్న 'అభివృద్ధి చెందిన భారత్'ను సాధించడమే తన సంకల్పమని మోదీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎన్నారై ఇంజినీర్‌కు టెక్సాస్ అత్యున్నత అకడమిక్ అవార్డ్

హ్యూస్టన్, ఫిబ్రవరి 26: అశోక్ వీరరాఘవన్ అనే ఇండో-అమెరికన్ ఇంజినీర్‌కు టెక్సాస్ అత్యున్నత అకడమిక్ అవార్డు 'ఎడిత్ అండ్ పీటర్ ఓడన్నెల్' దక్కింది. ఇమేజింగ్ సాంకేతికతలో ఆయన చేసిన పరిశోధనలకు గాను ఈ అవార్డును ఇచ్చారు. టెక్సాస్ అకాడమీ ఆఫ్ మెడిసిన్, ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీ అవార్డును బహుకరించనున్నది. వివిధ రంగాల్లో ప్రతిభ కనబర్చిన వారిని టెక్సాస్ రాష్ట్రంలో ఈ అవార్డుకు ఎంపిక చేస్తారు. ఈ ఏడాది ఇంజినీరింగ్ విభాగంలో వీరరాఘవన్ చేసిన కృషికి ఈ పురస్కారాన్ని ప్రకటించారు. చెన్నైకి చెందిన వీరరాఘవన్ ప్రస్తుతం రైస్ యూనివర్సిటీకి చెందిన జార్జ్ ఆర్ బ్రౌన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజినీరింగ్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. 2002లో ఐఐటీ మద్రాస్ నుంచి బీటెక్ పూర్తి చేశారు.

ఉజ్జయినిలో ప్రపంచంలోనే తొలి వేద గడియారం

న్యూఢిల్లీ: ప్రపంచంలో తొలి వేద గడియారాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మార్చి 1న వర్చువల్ విధానంలో ఆవిష్కరిస్తారు. భారతీయ సంప్రదాయ పంచాంగం ప్రకారం ఇది సమయాన్ని చూపిస్తుంది. దీనిని మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయిని నగరం, జంతర్ మంతర్ వద్ద 85 అడుగుల ఎత్తయిన టవర్‌పై ఏర్పాటు చేశారు. ప్రభుత్వ జివాజీ అబ్జర్వేటరీ సమీపంలో ఇది ఉంది. వైదిక పంచాంగం, గ్రహాల స్థితిగతులు, ముహూర్తాలు, జ్యోతిష సూచనలు వంటివాటిని ఈ గడియారం ప్రదర్శిస్తుంది. అంతేకాకుండా భారత కాలమానం (ఐఎస్‌టీ), గ్రీన్‌విచ్ మీన్ టైమ్ (జీఎంటీ)ల ప్రకారం కూడా సమయాన్ని చూపిస్తుంది.

3 వేల ఎకరాల్లో 'వంతారా'

న్యూఢిల్లీ: గాయపడిన, ఇబ్బందుల్లో ఉన్న జంతువులను సంరక్షించే లక్ష్యంతో 'వంతారా' కార్యక్రమాన్ని రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, రిలయన్స్ ఫౌండేషన్ డైరెక్టర్ అనంత్ అంబానీ సోమవారం ప్రారంభించారు. దేశ, విదేశాల్లో గాయపడిన, ప్రమాదంలో చిక్కుకున్న జంతువులను కాపాడి, చికిత్స చేసి, సంరక్షించి, పునరావాసం కల్పించడం 'వంతారా' ముఖ్య లక్ష్యం. వంతారా అనేది కృత్రిమ అడవి. గుజరాత్‌లోని జామ్‌నగర్ రిలయన్స్ రిఫైనరీ కాంప్లెక్స్‌లో 3 వేల ఎకరాల్లో ఇది ఉన్నది. ఈ అడవిలో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏనుగుల కోసం ప్రత్యేకంగా దవాఖాన ఉంది. ఇది ప్రపంచంలోనే అతిపెద్దది.

మీరు చేయకుంటే.. మేమే చేస్తాం

- **మహిళా కోస్టు గార్డ్ అధికారులకు శాశ్వత కమిషన్ ఏర్పాటుచేయాలి**
- **కేంద్రానికి సుప్రీంకోర్టు ఆదేశం**

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: శాశ్వత కమిషన్ మంజూరు విషయంలో సుప్రీంకోర్టు సోమవారం కీలక ఆదేశాలు జారీచేసింది. మహిళా కోస్టు గార్డ్ అధికారులకు పర్మినెంట్ కమిషన్ మంజూరు చేయడంపై సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర ప్రభుత్వానికి అల్టిమేటం జారీచేసింది. మహిళలకు అన్యాయం జరిగితే సహించేది లేదని స్పష్టం చేసిన కోర్టు.. 'మీరు చేయలేకుంటే.. మేం చేస్తాం' అని పేర్కొన్నది. ఈ విషయాన్ని పరిశీలించాలని కేంద్ర ప్రభుత్వ తరఫు న్యాయవాదికి సీజేఐ జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం సూచించింది. షార్ట్ సర్వీస్ కమిషన్ కింద కోస్టు గార్డు(తీర ప్రాంత రక్షణ) ఉద్యోగాల్లో నియమితులైన అర్హులైన మహిళా అధికారులకు శాశ్వత కమిషన్ మంజూరు చేయాలని కోరుతూ ఓ మహిళా అధికారి దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా న్యాయస్థానంలో అఫిడవిట్ దాఖలు చేయాలని కోస్టు గార్డ్ విభాగాన్ని కోరుతామని కేంద్ర ప్రభుత్వం తరఫున అటార్నీ జనరల్ ఆర్ వెంకట రమణి ధర్మాసనానికి తెలిపారు. నేవీ, ఆర్మీకి కోస్టు గార్డ్ విభాగం భిన్నంగా ఉంటుందని ఏజీ వాదించారు. పిటిషన్‌పై తదుపరి విచారణను న్యాయస్థానం మార్చి 1వ తేదీకి వాయిదా వేసింది. మహిళా అధికారి పిటిషన్‌పై ఈనెల 19న విచారణ సందర్భంగా సుప్రీంకోర్టు కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది.



కోస్టు గార్డ్ విషయంలో ఎందుకు తేడా చూపిస్తున్నారని ప్రశ్నించింది. 'కోస్టు గార్డ్ విభాగంలో మహిళలు ఎందుకు ఉండకూడదని మీరు అనుకొంటున్నారు? సరిహద్దులను కాపాడగలిగే మహిళలు.. సముద్ర తీర ప్రాంతాలను కూడా రక్షించగలరు! మీరు పదేపదే చెప్పే నారీశక్తిని.. చేతల్లో చూపించండి' అంటూ కేంద్రాన్ని దుయ్యబట్టింది. పితృస్వామ్య మనస్తత్వాన్ని ఎందుకు ప్రదర్శిస్తున్నారని ప్రశ్నల వర్షం కురిపించింది.

మోమోలు తేలేదని భర్తపై కేసు

ఆగ్రా మహిళ నిర్వాకం

ఆగ్రా: ఎవరైనా భర్త తనను మంచిగా చూసుకోవడం లేదనో, హింసిస్తున్నాడనో ఫిర్యాదు చేస్తారు. కానీ ఆగ్రాకు చెందిన ఓ వివాహిత తన భర్త తనకు మోమోలు తెచ్చివ్వటం లేదని పోలీస్ కేసు పెట్టింది. మోమో అనేది మన సమోసాల్లాగా పాపులర్ స్నాక్. యూపీలోని మల్పూరకు చెందిన మహిళకు పినహట్‌కు చెందిన ఓ వ్యక్తితో ఇటీవల వివాహం అయింది. పెండ్లి సమయంలో తనకు మోమోస్ అంటే ఇష్టమని వధువు చెప్పిందట. పెండ్లయ్యాక ఆమె భర్త క్రమం తప్పకుండా మోమోస్ తెచ్చేవాడని.. ఇటీవల అలా చేయటం లేదని ఆమె అలిగిందట. ఈ విషయమై తరచూ వారిద్దరి మధ్య గొడవ జరిగేది. ఓ రోజు అలిగిన భార్య తన పుట్టింటికి వెళ్లిపోయిందట. అక్కడి నుంచే భర్తపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు భార్యాభర్తలను కౌన్సిలింగ్‌కు పంపించారు. కొన్నిసార్లు డ్యూటీ ఆలస్యం వల్ల మోమోలు దొరకలేదని, మరి కొన్నిసార్లు మోమోస్ తీసుకోవటం మరిచిపోయానని భర్త తన గోడు వెళ్లబోసుకున్నాడు. ఇద్దరి మధ్య కౌన్సిలర్లు కుదిర్చిన రాజీ ప్రకారం భర్త వారానికి 2 రోజులు మోమోస్ తీసుకురావాలి. ఇందుకు అంగీకరించిన ఆ మహిళ భర్తతో కాపురానికి వెళ్లిందట.

మళ్లీ మరాఠా ఉద్యమం

- **ఓబీసీ క్యాటగిరీ కిందే రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్**
- **బస్సుకు నిప్పు.. మూడు జిల్లాల్లో ఇంటర్నెట్ బంద్**

జాల్నా జిల్లాలో ఆందోళనకారులు నిప్పు పెట్టడంతో తగలబడుతున్న బస్సు

ముంబై, ఫిబ్రవరి 26 (నమస్తే తెలంగాణ): మహారాష్ట్రలో మరాఠా రిజర్వేషన్ల అంశం మరోసారి వేడెక్కింది. రాష్ట ప్రభుత్వం మరాఠాలకు ప్రత్యేకంగా 10 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు గత వారం ప్రత్యేక అసెంబ్లీ సమావేశాల్లో ఆమోదం తెలిపింది. అయితే మరాఠాలకు ఓబీసీ క్యాటగిరీ కింద రిజర్వేషన్లు కల్పించాలని, కుంబీ సర్టిఫికెట్లు ఇవ్వాలని ఆందోళనకారులు డిమాండ్ చేస్తున్నారు. జాల్నా జిల్లాలోని అంబద్ తహశీల్ పరిధిలో ఒక ఆర్టీసీ బస్సుకు నిప్పు పెట్టారు. ఈ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. అంబద్ తాలూకాలో ఆదివారం రాత్రి నుంచి కర్ఫ్యూ విధించారు. జాల్నాతోపాటు చత్రపతి శంభాజీనగర్, బీడ్ జిల్లాల్లో సోమవారం ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారు. కాగా, మరాఠాలకు ఓబీసీ రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తూ జాల్నా జిల్లాలోని అంతర్వాలి సారటి గ్రామంలో గత 17 రోజులుగా చేస్తున్న నిరాహారదీక్షను ఉద్యమ నేత మనోజ్ జరాంగే సోమవారం విరమించారు. తన ఆరోగ్యంపై నెలకొన్న గందరగోళానికి తెరదించేందుకు ఈ నిర్ణయం తీసుకొన్నానని పేర్కొన్న ఆయన.. తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. నిరాహార దీక్ష జరిగిన ప్రాంతంలో రోజుకు 3-4 యువకులు రిలే దీక్షలు చేస్తారని తెలిపారు. మరోవైపు మనోజ్ జరాంగేపై పోలీసులు తొలిసారిగా కేసు నమోదు చేశారు. గత వారం బీడ్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆయన మద్దతుదారులు అనుమతి లేకుండా ఆందోళనలు చేయడం, రోడ్లను దిగ్బంధించడంపై రెండు కేసులు నమోదు చేసినట్టు పోలీసులు సోమవారం వెల్లడించారు. ఆందోళనలు మళ్లీ ఉధృతి అయిన నేపథ్యంలో ఆదివారం అర్ధరాత్రి పోలీసులు పలువురు మనోజ్ జరాంగే సహచరులను అదుపులోకి తీసుకున్నారు.



దేశంలోకి ప్రొఫెసర్ నిటాషాకు అనుమతి నిరాకరణ

బెంగళూరు, ఫిబ్రవరి 26: యూకే నుంచి వచ్చిన భారత సంతతికి చెందిన ప్రొఫెసర్ నిటాషా కౌల్‌కు దేశంలోకి ప్రవేశాన్ని ఇమ్మిగ్రేషన్ అధికారులు నిరాకరించారు. దీంతో కర్ణాటక ప్రభుత్వ ఆహ్వానం మేరకు 24, 25 తేదీల్లో జరిగిన 'రాజ్యాంగ, జాతీయ ఐక్యత సదస్సు-2024'లో పాల్గొనేందుకు వచ్చిన ఆమె.. బెంగళూరు ఎయిర్‌పోర్టులోనే నిలిచి పోవాల్సి వచ్చింది. కశ్మీరీ పండిట్ అయిన నిటాషా కౌల్ బ్రిటన్‌లో యూనివర్సిటీ ఆఫ్ వెస్టుమినిస్టర్‌లో ప్రొఫెసర్. భారత్‌లోకి తనకు ప్రవేశం నిరాకరించడంపై నిటాషా ఆదివారం ఎక్స్‌లో వరుస పోస్టులు చేశారు. తన వద్ద పాస్ట్‌పోర్టు, ఇతర అన్ని పత్రాలు ఉన్నా తనను అడ్డుకోవడంపై అధికారులు కారణాలు చెప్పలేదన్నారు. కాగా, నిటాషాకు అనుమతి నిరాకరణపై కాంగ్రెస్, బీజేపీ మధ్య మాటల యుద్ధం జరిగింది. ఇది భావ ప్రకటనా స్వేచ్ఛ, సమాఖ్య సూత్రాలపై దాడి అని కాంగ్రెస్ పేర్కొన్నది. నిటాషా ఒక టెర్రరిస్టు సానుభూతిరాలు అని బీజేపీ ఆరోపించారు.

ట్రిపుల్ ఐటీ విద్యార్థినులకు 83 లక్షల ప్యాకేజీ

భాగల్‌పూర్, ఫిబ్రవరి 26: ఇషికా ఝా, సంస్కృతి మాలవీయ ఇద్దరూ బీహార్‌లోని భాగల్‌పూర్ ట్రిపుల్ ఐటీలో బీటెక్ (కంప్యూటర్ సైన్స్) మూడో సంవత్సరం చదువుతున్నారు. చదువు ఇంకో సంవత్సరం ఉండగానే వీరిద్దరికి క్యాంపస్ సెలక్షన్స్‌లో అదిరిపోయే ప్యాకేజీతో ఆఫర్ దక్కింది. 83 లక్షల వార్షిక వేతనంతో ఈ ఇద్దరు అమ్మాయిలు జాబ్ కొట్టేశారు. అంటే నెలకు అక్షరాల 7 లక్షల వేతనం. సాధారణంగా ఇంత పెద్ద ప్యాకేజీలు ఐఐటీ, ఐఐఎం విద్యార్థులకు లభిస్తుంటాయి. అట్లాంటిది ట్రిపుల్ ఐటీ చేస్తున్న ఈ ఇద్దరు విద్యార్థులకు ఇంత భారీ ప్యాకేజీలు దక్కటం విశేషం. ఇషికాది హర్యానాలోని ఓ చిన్న పట్టణం కాగా, సంస్కృతిది యూపీలోని ప్రయాగ్‌రాజ్.

మొబైల్ సేవలకు అంతరాయం.. యూజర్లకు పరిహారం

వాషింగ్టన్: అమెరికాలో గత వారం న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, శాన్‌ఫ్రాన్సిస్కో తదితర ప్రాంతాల్లో టెలికం సేవల్లో ఏర్పడిన అంతరాయంపై ఏటీ అండ్ టీ కంపెనీ స్పందించింది. సిగ్నల్ సమస్యతో ప్రభావితమైన వినియోగదారులకు ఒక్కొక్కరికి ఐదు డాలర్ల చొప్పున పరిహారం అందించనున్నట్టు ఆదివారం ప్రకటించింది. పోస్టు పెయిడ్ యూజర్లకు వచ్చే రెండు బిల్లింగ్ సైకిళ్లలో ఈ పరిహారాన్ని జమ చేస్తామని తెలిపింది. ప్రీపెయిడ్ యూజర్లకు పరిహారం విషయంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నది. ఒకే సమయంలో అన్ని నెట్‌వర్క్‌లలో అంతరాయం తలెత్తడం చర్చనీయాంశంగా మారింది.



ఇక కచ్చితమైన గర్భధారణ వయసు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 26: గర్భిణిలో పెరుగుతున్న పిండం కచ్చితమైన వయసును నిర్ధారించేందుకు ఐఐటీ మద్రాస్ పరిశోధకులు దేశంలోనే తొలిసారి కృత్రిమ మేధ (ఏఐ) మోడల్‌ను అభివృద్ధి చేశారు. గర్భిణి విషయంలో సరైన సంరక్షణ, కచ్చితమైన డెలివరీ తేదీ నిర్ణయించేందుకు గర్భధారణ వయసు (జీఏ) అవసరం. శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఈ మోడల్‌ను 'గర్భిణి-జీఏ2'గా పిలుస్తున్నారు. ప్రత్యేకంగా భారతీయులను దృష్టిలో పెట్టుకుని ఈ నమూనా(గర్భిణి-జీఏ2)ను అభివృద్ధి చేశారు. ఇది భారతీయ స్త్రీలు గర్భం దాల్చిన తర్వాత కచ్చితమైన గర్భధారణ వయసును అంచనా వేస్తుంది. అంతేకాదు, గతంలో తలెత్తిన దోషాలను మూడురెట్లు తగ్గిస్తుంది.

మంకీ ఫీవర్‌తో కర్ణాటకలో మరొకరి మృతి

బెంగళూరు, ఫిబ్రవరి 26: కర్ణాటకలో మంకీ ఫీవర్ కలకలం రేపుతున్నది. ఈ వ్యాధితో మరొకరు ప్రాణాలు కోల్పోయారు. ఉత్తర కన్నడ జిల్లాలో ఓ మహిళ (60) మంకీ ఫీవర్‌తో 20 రోజులపాటు పోరాడి, ఆదివారం ప్రాణాలు కోల్పోయారు. సిద్ధాపూర్ తాలూకా, కూర్లకై గ్రామానికి చెందిన ఈ మహిళకు శివమొగ్గలోని ఓ దవాఖానలో మూడు రోజులపాటు చికిత్స చేశారు. ఆమె ఆదివారం రాత్రి తుది శ్వాస విడిచారు. దీంతో కర్ణాటకలో ఈ వ్యాధి కారణంగా మరణించినవారి సంఖ్య నాలుగుకు పెరిగింది. సిద్ధాపూర్ తాలూకాలో మంకీ ఫీవర్ కేసులు 43 ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద 103 మంది ఈ వ్యాధి బాధితులు ఉన్నారు.

అంటార్కిటికా భూభాగంలో బర్డ్‌ఫ్లూ తొలి కేసు

న్యూఢిల్లీ: అంటార్కిటికా ఖండంలోని ప్రధాని భూభాగంలో తొలి బర్డ్ ఫ్లూ కేసు నమోదైంది. ఇది పర్యావరణ విపత్తుకు దారితీయొచ్చని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పక్షుల్లో తీవ్ర అనారోగ్యానికి కారణమయ్యే ఈ వైరస్‌ను ఈ నెల 24న గుర్తించారు. మృతిచెందిన రెండు స్కువా పక్షుల నుంచి సేకరించిన నమూనాల్లో ఈ వైరస్ ఉనికిని గుర్తించారు. అంటార్కిటికాలో ఉండే వేలాది పెంగ్విన్‌లకు ఈ వ్యాధి ప్రబలే ప్రమాదమున్నదని శాస్త్రవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇది మనుషులకు వ్యాప్తి చెందకుండా సీఎస్‌ఐసీ పరిశోధకులు చర్యలు చేపడుతున్నారు. పక్షుల్లో ప్రాణాంతకమైన హెచ్5ఎన్1 రకాన్ని 1997లో తొలిసారిగా ప్రపంచ ఆరోగ్య సంస్థ గుర్తించింది.